'పాపం, పుట్టెడు సానుభూతి, కడివెడు కన్నీళ్లు వెంటతీసుకొని స్నేహితురాల్ని ఓదార్చాలని వెళ్లిన మనిషికి వాటి అవసరమే, రాకపోతే కోపంరాదూ?'

# 9

# ఆడదానికి శత్రువు

సాయంకాలం నాలుగు గంటల వేళ. పండక్కి పుట్టింటికి వెళ్లిన శ్రీమతి ఇంకా తిరిగిరాలేదు. వంటవాడు మల్లయ్య ఇచ్చిన కాఫీ, ఫలహారం సేవించి బద్ధకంగా పడక కుర్చీలో చేరబడ్డాను. ఎదురుగుండా టేబులుమీద కొత్తగా వచ్చిన ఫిల్మ్‌ఫేర్ కాగితాలు ఫాన్ గాలికి రెపరెపలాడుతూ అక్కడ తమ ఉనికిని తెలియబరుస్తున్నాయి.

ఆరోజు అయిందికి ఆదివారమే అయినా పన్నెండు గంటల వరకు ఆఫీసులో అర్జంటు కాగితాలు చూస్తూ, ఉత్తరాలు డిక్టేటు చేస్తూ ఉండిపోవలసివచ్చింది. ఇంకా మిగిలిఉన్న పని సెక్రటరీకి అప్పగించి, ఏమైనా అవసరం అయితే ఇంటికి ఫోను చెయ్యమని చెప్పి తిరుగు ముఖం పట్టేసరికి ఉదయం తిన్న ఉప్మా, పెసరట్టు ఏ మూలకి పోయేయో కడుపంతా కాళీఅయి కూర్చుంది. ఇంట్లో కాలు పెడుతూంటే ఆకలి కరకరమని తొందరచేసింది.

నా అదృష్టవశాత్తు ఆ ముందురోజు రాత్రి మల్లయ్య రెండో ఆట సినీమాకి పోలేదు. పట్నంలో అతడు చూడని కొత్తసినీమాలు లేకపోవడం దానికి కారణం కావచ్చు. లేక ముందురోజు కొత్తగా రిలీజైన సినీమాకి టికెట్టు కొనుక్కొంటున్న సమయంలో అతడి జేబులోంచి ఎవడో పర్సు కొట్టేయడంతో అంత దొమ్మీగా ఉన్నప్పుడు పోకూడదని బుద్ధి తెచ్చుకొని ఉండవచ్చు. కారణం ఏమైనా, ఆ రోజు మాడిపోని కూర, చిమిడిపోని అన్నం, రాళ్లు లేని పప్పూతో భోజనం నాకు లభ్యమయింది. కడుపునిండా తిండి తిని, ఓ కునుకు తీసి లేచేసరికి నాలుగయింది.

ఫిల్మ్‌పేర్‌లో అందమైన తారల ఒంపు, సొంపు ఆకారాలు చూస్తూ, వారి అలవాట్లు, అగచాట్లు చదువుతూంటే వీధి తలుపు చప్పుడయింది.

మరునాటి ఉదయం టపాలో పోవలసిన కొన్ని అర్జంటు ఉత్తరాలు ఉన్నాయని, సంతకాలకోసం వాటిని పంపుతున్నానని కాఫీ ఆరగిస్తూంటే టెలిఫోను ద్వారా ఒక విన్నపం పంపించేడు సెక్రటరీ రాజారావు. "ఓకే" అన్నాను ఆఖరి గుక్క కాఫీ పూర్తి చేసి.

మళ్లా తలుపు చప్పుడయింది. కుర్చీలో సరిగా సర్దుకొని కూర్చుని, చేతిలో ఉన్న ఫిల్మ్‌పేర్ పక్కన పెట్టి, న్యూసుపేపరు మరీ దీక్షగా చదివేస్తున్నట్లు ముఖానికి అడ్డంగా పెట్టుకొని, "రావచ్చు" అన్నాను ఆఫీసరు హోదా ఒలకపోస్తున్న గొంతుకతో.

మెల్లగా తలుపు తెరుచుకొంది. డవాలా బంట్రోతు రామయ్య మొరటు పాదాలకి బదులుగా అందమైన, అతి సున్నితమైన అమ్మాయి పాదాలు కన్పించేయి. ఆ పాదాల అందానికి, సౌకుమార్యానికి మురిసిపోతూ పేపరు మరి కాస్త ఎత్తి పట్టుకొన్నాను. అందమైన ఆ పాదాలని తాకుతూ జరీఅంచుతో మిల మిల మెరిసిపోతున్న లేత నీలంరంగు చీరకుచ్చెళ్లు, ఇంకా కొంచెం పైకి చూస్తే కుడిచేతికి వేలాడుతున్న హేండ్‌బాగ్, మరి కాస్త మీదికి పోతే ముదురు నీలంబ్లౌజుకి, లేత నీలంచీరకి మధ్య కాళీలో పచ్చగా, నున్నగా మెరసిపోతున్న సన్నని నడుము, యౌవనంతో దోబూచులాడుతున్న పైటమీదుగా సన్నని బంగారు చైను, దాని మధ్యగా ఒక పొళ్ల పతకం—నా కళ్లకి ఆ అందానికి మధ్య అంతవరకు తెరగా నిల్చిన న్యూసుపేపరు నా ప్రయత్నం లేకుండానే చేతిలోంచి జారిపోయింది.

ఆ వాలు కుర్చీలో పేపరుచాటున ముఖం దాచుకొన్న నన్ను ఆమె చూసి ఉండలేదేమో, ఇంటిలోకి దృష్టి పోనిస్తూ, "శాంతా!.... శాంతా!" అంటూ బిగ్గరగా పిలవసాగింది. నిర్మలమైన నీటిలో

ఆహారం కోసం ఆత్రంగా అటు ఇటు కదలాడుతున్న చేపల్లా ఉన్నాయి ఆ కళ్లు.

"శాంత ఊరికి వెళ్లింది. రండి. కూర్చోండి." గౌరవంగా లేచి ఆమెను ఆహ్వానిస్తూ అన్నాను.

"ఏ ఊరెళ్లింది? ఎప్పుడు తిరిగి వస్తుంది?'' అంటూ ప్రశ్నించింది ఆమె.

"పండక్కి పుట్టింటికి వెళ్లింది. పుట్టింటఉన్న ఆడపిల్ల ఎప్పుడు వస్తుందో చెప్పడానికి ఏ మగాడికైనా కొంచెం కష్టమైన పనే. గోడమీద పిల్లిలా ఏ క్షణాన్నయిదా ఎటో అటు దూకవచ్చు. లేక అలా ఎంతసేపైనా అక్కడే కూర్చోవచ్చు" అన్నాను అసలు విషయానికి కాస్త హాస్యం జోడించి.

"సరిపోయింది. శాంతని చూడ్డం అవుతుందని ఎంతో ఆశతో వచ్చేను. అయినా తప్పు నాదేలెండి. ముందుగా ఉత్తరం రాయవలసింది. కాని ఏదానికీ సమయం లేకుండా పోయింది.....''

''ఇంతకీ... మీరు....''

"శాంతా, నేనూ స్నేహితులం. నా పేరు విమల.''

విమల అన్న పేరు వినగానే చాలా కాలం కిందట శాంత చెప్పిన ఏదో విషయం గుర్తుకు రాసాగింది. ఆరోజు కొత్తగా రిలీజు అయిన ఇంగ్లీషు పిక్చర్‌కి బ్రహ్మాండం బద్దలు కొట్టినంత పనిచేసి ఫస్టుషోకు టిక్కెట్లు తీసుకొన్నాను. ఇంకా అయిదు గంటలు కాకుండానే ఆఫీసునుంచి ఇంటికి వచ్చి అర్ధాంగిని ఆశ్చర్యపరచాలని పుట్టెడాసతో నే వస్తే ముఖం వేలవేసుకొని దిగాలుపడి కూర్చుంది శాంత.

"ఏమయింది శాంతా, ఒంట్లో బాగాలేదా? ఉదయం నేను వెళ్లేసరికి సరిగానే ఉన్నావే? నీకు ఇష్టమైన పిక్చరని ఫస్టుషోకి టిక్కెట్లు తెచ్చేను. లే....లే.... తొందరగా తెమలాలి మరి. అలా కాస్తసేపు బయట తిరిగివస్తే అంతా సర్దుకుపోతుంది" అంటూ ఆమెని ఉత్సాహపరచాలని శతవిధాల ప్రయత్నం చేసేను. ఊహూఁ.

ఆమెలో అణుమాత్రంకూడా చలనం లేదు. అసలు నా మాట ఒకసైనా ఆమె చెవిని పడిందా అన్న అనుమానం వచ్చింది. పరాగ్గా ఎటో చూస్తున్న ఆ కళ్లలో కనుపాపలైనా కదిలినట్లు అని పించలేదు. ఆ స్థితిలో శాంతని చూస్తుంటే నాకు భయం వేసింది.

"శాంతా" అన్నాను గట్టిగా పట్టుకొని కుదుపుతూ.

"ఓ....మీరా....ఎంతసేపయింది వచ్చి?" అంది శాంత అప్పుడే ఈ లోకంలోకి వస్తూ.

"ఇప్పుడే వచ్చేను. కాని, ఏమలా ఉన్నావు?'' అన్నాను ఆత్రంగా.

"అబ్బే. ఏంలేదు. ఏదో అలా ఆలోచిస్తూ ఉండిపోయేను'' అంది శాంత.

"పతిదేవుడు ఇంటికొచ్చినా పలకరించలేనంత ఆలోచనలేమిటే భామా!'' అన్నాను వీథినాటకం పక్కీలో రాగం తీస్తూ.

శాంత నా హాస్యాన్ని అందుకోలేదు. అందుకొన్నా దానికి జవాబు ఇచ్చే స్థితిలో లేదు. ముఖంలో చిరునవ్వయినా తొంగి చూడకుండా అలాగే ఉండిపోయింది. 'ఈరోజు శాంత కేమయింది? ఎందుకిలా ఉంది' అనుకొన్నాను.

"ఏమండి.... విమల భర్త పోయేడుటండీ" అంది శాంత వస్తున్న దుఃఖాన్ని ఆపుకొంటూ.

"ఎవరు ....విమలా ....ఏ విమల?'' అన్నాను- శాంతను అంతగా విచార సాగరంలో ముంచెత్తిన ఈ విమలా, ఈమె భర్తా ఎవరా అని ఆలోచిస్తూ.

"నా స్నేహితురాలు విమలండీ. తెలియనట్లు అలా అడుగుతా రేం? మా వాళ్ల ఇంటి పొరుగున ఉండే పరంధామయ్యగారి కూతురు. మీరు మొదటిసారి పండక్కి మా వాళ్లింటికి వచ్చి నప్పుడు నాకు మొగలిరేకుల జడ కుట్టి, జడ ఎంతో బాగుందని నేను మెచ్చుకొంటూంటే 'మెచ్చుకోగానే సరికాదు. దీనితో బావ గార్ని కొట్టి బాగా లొంగదీసుకోవాలి' అంటూ మీ వంక చూసి కొంటెగా నవ్వెందే!....ఆ పిల్ల ....గుర్తుందా?''

హతోస్మి....శాంత అంత విపులంగా శృంగార భరితమైన ఆ సన్నివేశాన్ని వర్ణించి చెప్పినా, ఆ పండుగ మూడు రోజులు "బావగారు....బావగారు...." అంటూ నా భరతం పట్టించిన శాంత స్నేహబృందంలో కొంటెగా నావంక చూపి నవ్విన ఈ కోమలాంగి ఎవరో ఎంతకీ నాకు జ్ఞాపకం రాలేదు. అంత వివరంగా చెప్పినా గుర్తురాలేదంటే శాంత తారాజువ్వలా నా పైకి లేస్తుంది. తన స్నేహితురాళ్లపట్ల నాకు తగినంత గౌరవం లేదంటుంది. మీ స్నేహితుల్ని పేరు పేరునా నే నెలా జ్ఞాపకం ఉంచుకొంటున్నానంటుంది. అందుకే అందంగా ఒక చిన్న అబద్ధం ఆడి తప్పుకొన్నాను. "ఓ ఆ పిల్లా! ముఖమైతే గుర్తుందిగాని పేరు మరిచిపోయే" నంటూ.

కాని ఎదురుగా ఉన్న ఈమె ఆ విమల ఎలాగవుతుంది? నుదుటి మీద తీర్చిదిద్దినట్లున్న ఆ బొట్టు, జడపై లూజుగా వేలాడుతున్న చేమంతిపూల దండ, కలకల్లాడే ముఖంపై అందమైన ఆ చిరునవ్వు—. 'ఈ విమల ఎవరబ్బా?' నాలో నేను మథనపడుతున్నా. సభ్యతకోసం. "రండి, కూర్చోండి" అన్నాను.

ఆమె వచ్చి నాకు ఎదురుగా ఉన్న కుర్చీమీద కూర్చుంది. అంత దగ్గర్లో ఉన్న ఆ అందం అర్ధరాత్రి మీరేక పరిమళించే నైట్‌క్వీన్ వాసనలా మరీ ఘాటుగా, మత్తుగా ఉంది. ఆమెతో ఏం మాట్లాడాలో, ఎలా సంభాషణ మొదలుపెట్టాలో నాకు పాలుపోలేదు. రెండు మూడు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచిపోయేయి. చివరికి ఆమే సంభాషణకి దారితీసింది.

"ఆ మధ్య మద్రాసు ఉమెన్సు కాలేజీలో డెమాన్‌స్ట్రేటర్ ఉద్యోగానికి అప్లయి చేసేను. ఇప్పుడు ఇంటర్వ్యూకి పిలుపు వచ్చింది. ఎక్స్‌ప్రెస్‌కి జి. టి. అందుతుంది అనుకొన్నాను. తీరా ఇది వచ్చేసరికి అది వెళ్లిపోయింది. ఇంక మెయిలు వచ్చేవరకు ఆ స్టేషనులో పడిగాపులుపడి ఉండాలనుకొంటుంటే శాంత ఈ ఊళ్లో ఉన్న సంగతి గుర్తుకొచ్చింది. సరి. ఇదీ మంచికే అయింది.

శాంతనికూడా ఒకసారి చూడ్డం అవుతుంది అనుకొన్నాను. ఇంతా వస్తే....అవిడేమో పుట్టింటికి వెళ్లికూర్చుంది.'' కాస్త నిరుత్సాహం. కాస్త నిష్ఠూరం ధ్వనించేలా అంది ఆ మాట.

ఏపాటి కొత్తలేకుండా రోజు కలుసుకొంటున్న తన మిత్రులతో ఏదో చెప్పుకుపోతున్నట్లు ఆమె అలా మాట్లాడుతుంటే ఏమనాలో. ఏది మానాలో తెలియక వాజమొహం వేసుకొని కూర్చున్నాను నేను.

మనసులో లేచిన అనుమానం పుండులా ఓ మూలనుంచి సలుపుతున్నాది. ఈమె మా శాంత స్నేహితురాలు విమల కాదేమో. పొరపాటున ఒకరింటికి పోబోయి మరొకరింటికి వచ్చిందేమో? నాకు తెలిసినంతవరకే మా వీథిలోనే ముగ్గురు శాంతలు ఉన్నారు. మా ఆవిడ శాంత. రాఘవయ్యగారి భార్య శాంతాదేవి. అవధానిగారి సతీమణి శాంతమ్మ. ఇంకా ఈపక్కా, ఆపక్కా వీథుల్లో ఎంతమంది శాంత లుండిఉంటారో?

ఈమె నిజంగా మా శాంత స్నేహితురాలే అయితే ఈమెకి చేయవలసిన మర్యాద ఒకలాగ ఉంటుంది. నేను ఏ మాత్రం అశ్రద్ధ చేసినా తను ఇంటలేనప్పుడు వచ్చిన తన స్నేహితురాలికి తగిన విధంగా మర్యాద చెయ్యలేదని నేను బ్రతికున్నంతకాలం శాంత నన్ను సాధిస్తూనే ఉంటుంది. అలాకాక ఈమె ఆ శాంతాదేవిగారి కోసమో లేక ఈ శాంతమ్మగారికోసమో వచ్చిన చుట్టం అయితే అందమైన ఈ ఆదివారపు సాయంకాలాన్ని ఆవిడకోసం పాడు చేసుకోవలసిన అవసరం నా కెంతమాత్రం లేదు. ఏది ఎలాగైనా ఈ విషయం నికరంగా ముందు తెలుసుకోవలసిందే అనుకొన్నాను.

"ఏమండీ....ఇలా అడుగుతున్నందుకు మీరు మరోలా అనుకోకండి. మీరు ఇంటి ఎడ్రసు సరిగా చూసుకొన్నారా? మరేంలేదు. ఈ వీథిలో శాంత పేరు ఉన్నవారు ముగ్గురున్నారు. పొరపాటున ఒక ఇల్లనుకొని ఇంకొక ఇంటికి రాలేదు కదా?...."

ఆ మాట కాస్తా అన్నాక నన్ను నేనే పడతిట్టుకొన్నాను. అందమైన ఈ అమ్మాయి ఏ శాంతకోసం వస్తే నాకేం మునిగి

పోయింది? ఒంటరిగా ఉన్న మగాడిని కదా, కాస్తసేపు కులాసాగా గడిపి నాలుగు కబుర్లు చెప్పిపంపిస్తేపోదా! అందునా ఇంత కలివిడిగా, ఇంత చొరవగా ఆమె ఉంటున్నప్పుడు ఈ కుశంకలన్నీ పెట్టుకొని ఏడవమని ఏ బుద్ధిలేనివా డంటాడు? కాని, మాట నోరు జారేక అప్పుడు ఏమనుకొని ఏం లాభం. ఆమె చెప్పబోయే జవాబుకోసం చెవులు రిక్కించుకొని ఉండడం తప్పిస్తే?

నువ్వు వట్టి అనుమానం మనిషిలా ఉన్నావే, ముసలివాడిలా అప్పుడే నీ కింత చాదస్తం ఏమిటయ్యా అన్నట్లు నా వంక చూస్తూ "అదిగో, ఆ గోడకి తగిల్చిఉన్న ఫోటోలో శాంతకోసం నేను వచ్చేను. కొంపతీసి ఆవిడ ఈ ఇంట్లో ఉండడం లేదేమిటి?" అంది ఆమె తన మాటకి కాస్త కొంటెతనం జోడిస్తూ.

"ఆ ఫోటో మా శాంతదే. అయితే మీరు మా శాంతకోసమే వచ్చేరన్నమాట! ఆఁ.... అన్నట్లు మరిచిపోయేను.... క్షమించాలి. మీ పేరేమిటన్నారు? నాకు కొంచెం మతిమరుపు జాస్తిలెండి" అన్నాను. బహుశః నేను ఆమె పేరు వినడం పొరపాటయి ఉంటుంది అనుకొన్నాను.

"నా పేరు విమలండీ, రామారావుగారూ" అంది ఆమె నెమ్మదిగా.

ఆమె ఆ మాట ఎంతో నెమ్మదిగా వినయంగా చెప్పినా ఆ కళ్లు నన్ను పరిహసిస్తూనే ఉన్నాయి. ఇంత పెద్ద ఉద్యోగం చేస్తున్న ఆఫీసరువు అయిదు నిమిషాలకిందట చెప్పిన పేరే జ్ఞాపకం ఉంచుకోలేకపోతే ఇంక నువ్వేం ఉద్యోగం చేస్తావయ్యా అంటూ. అంతతో ఊరుకోక చాచి లెంపకాయ కొట్టినట్టు ఆమె నన్ను పేరుతో సంబోధించడంతో నా కళ్లు బుర్రచుట్టు ఒకసారి తిరిగి అదృష్టవశాత్తు మళ్లా సరియైన స్థానంలోనే వచ్చి పడ్డాయి.

ఈమె తన పేరు విమల అంటున్నాది. విమలకి భర్త పోయేడని శాంత చెప్పినట్లు గుర్తు. ఈ రెండు మాటలకి ఏ విధంగానూ సమన్వయం కుదరకపోవడం అప్పుడు నన్ను వేధిస్తున్న సమస్య. అంతలో ఒక చక్కటి ఆలోచన బుర్రలో మెరుపులా మెరిసింది.

దానితో ఎక్కడలేని ధైర్యం ఒక్కసారిగా పొంగుకొచ్చింది. కుర్చీలో నిటారుగా సర్దుకొని కూర్చున్నాను.

విమల అన్న పేరు వినగానే ఎన్నో విషయాలు గుర్తుకొచ్చినట్లు ముఖాని కింత పరిచయం పులుముకొని "సరి... సరి....ఇప్పుడు గుర్తుకొచ్చింది. మా పెళ్లి అయిన కొత్తలో మా అత్తవారింటికి పండక్కి, పబ్బానికి వచ్చినప్పుడు మీరంతా కలసి 'బావగారు.... బావగారు' అంటూ నా పని పట్టించేవారు" అన్నాను. అనడానికి ఆ మాట అన్నానే కాని ఆ గాంగులో ఈ పిల్ల ఉండేదో లేదో నాకు తెలియదు. తీరా ఆమె "మాది మీ అత్తవారి ఊరు కాదండీ, శాంత చిన్నతనంలో తాతగారింటికి వచ్చేటప్పుడు కలసి ఆడుకొనేవారిమి" అందో నా పని అయినట్లే।.... మరో తెల్ల మతాపా కాల్చవలసిందే.

"హమ్మయ్య. ...ఇప్పటికి పోల్చేరన్నమాట. నేను ఈ ఇంట కాలు పెట్టినప్పటినుండి మీ మాటలు, వాలకం చూస్తుంటే 'నువ్వెవరో నాకు తెలియదు. మా శాంత స్నేహితురాలివి అసలే కాదు. తిన్నగా వచ్చిన దారినే వేంచెయ్యి. మెయిలు గంటో, రెండు గంటలో లేటయినా ఆ స్టేషన్‌లోనే అఘోరించు'అంటా రనుకొన్నాను. ఎలాగైతేనేమి చివరకి గుర్తుకొచ్చేనన్నమాట" అంది ఆవిడ, తేలిక పడ్డట్లు ఊపిరి పీలుస్తూ.

"అయ్యో ...ఎలా మరిచిపోతానండీ? ఇందాకా ఏదో ఆలోచిస్తూ మీ పేరు తిన్నగా వినకపోవడంచేత పోల్చుకోలేకపోయేనుకాని.... ఆఁ....అన్నట్లు మీలాగే శాంతతో సన్నిహితంగా ఇంకో అమ్మాయి ఉండేది కదూ....ఆ అమ్మాయి పేరూ విమలే అనుకొంటాను.... ఆమె ఇప్పు డెక్కడ ఉన్నారు....ఏమిటి సంగతి?" అన్నాను శాంత స్నేహితురాళ్ల యోగక్షేమాలు తెలుసుకోడం నా కెంతో అవసర మైనట్లు.

'ఆఁ....అవునండీ....ఆ పిల్లపేరూ విమలే. ఎంతో అందంగా ముట్టుకొంటే కందిపోయేంత సుకుమారంగా ఉండేది. శాంతా, నేను కిందటిసారి దాని పెళ్లిలోనే కలుసుకొన్నాం. విమల మొగుడు

ఇంజనీరు. అదంటే అతడికి ఎంతో అనురాగం, అభిమానం. ఒక్క-క్షణం వదలి ఉండేవాడు కాడు. విమలకికూడా అతడంటే పంచ ప్రాణాలు. పుట్టింటిలోను, అత్తింటిలోను ఎంత అవసరంపడినా ఒక్క రోజైనా ఉండేదికాదు. అడవుల్లోనైనా, కొండల మీదైనా అతడి వెంటనే ఉండేది. హుఁ....వాళ్ల అనుకూల దాంపత్యంచూసి ఆ దేవుడుకూడా అసూయతో కళ్లు కుట్టుకొన్నాడు. స్నేహితులతో నదిలో సరదాగా స్నానం చేస్తూంటే విమల మొగుణ్ణి మృత్యువు పొట్ట పెట్టుకుంది. ఇటు నాపరాయిలాంటి మనసు గల సవితితల్లి. అటు పరమ ఛాందసులైన అత్తమామలు; పాపం ఆ పిల్లగతి ఏమవుతుందో చూడండి' అంటూ కళ్లనీళ్లతో ఆమె జవాబు చెబుతుందని ఎదురుచూసేను.

"అబ్బే....శాంత స్నేహితురాళ్లలో నాకు తెలిసినంతవరకు విమ అన్న పేరు గలవాళ్లు నేనుకాక మరెవ్వరూ లేరు" అంది ఆవిడ, నా అనుమానాన్ని తేల్చివేస్తూ.

ముఖానికి పట్టిన చెమట జేబురుమాలుతో తుడుచుకొంటూ, కుర్చీలోంచి లేచి మెల్లగా తిరుగుతున్న ఫాన్ ఆన్‌లో పెట్టేను. ఇంక ఈ డొంకతిరుగుడు సంభాషణతో అసలు విషయం నేను తెలుసుకొనే మార్గం లేదు. అలా చమత్కా-రంగా మాట్లాడి అసలు గుట్టు లాగే నేర్పు కొంతమందికే ఉంటుంది. నా కటువంటి నేర్పు లేదన్న సంగతి ఏనాడో తేలిపోయింది. పోనీ, కుండబద్దలు కొట్టినట్లు తేల్చుకొందామన్నా అయే పని కాదు. శాంత కందిన సమాచారం పొరపాటు అయితే, లేక శాంత చెప్పిన పేరు నేను సరిగా విని ఉండకపోతే, "ఏమమ్మా, నీ మొగుడు పోయేడని విన్నాం. నిజమేనా?" అని ప్రశ్నిస్తే ఈ పిల్ల ఎంత బాధపడుతుంది? అయినా గంటో, గడియో ఉండి వెళ్లిపోయే ఈమె విధవైతే నాకేం, సధవైతే నాకేం—ఏదో ఆ కబురు, ఈ కబురు చెబుతూ కాస్తసేపు కాలక్షేపం చేసి అంపకం పెడితే సరిపోయే దానికి అనుకొన్నాను.

ఇంక తను వెళ్లవలసిన సమయం అయిందన్నట్లు రిస్టువాచీ వంక చూస్తూ హేండ్‌బాగ్ అందుకొంది ఆమె.

"వెళ్లొస్తానండి. నే నిలా వచ్చినట్లు శాంతతో చెప్పండి. నా తిరుగు ప్రయాణం ఎప్పుడు పడేది ఉత్తరం రాస్తాను. అప్పటికి శాంత తిరిగి వస్తుందనే అనుకొంటాను" అంది.

"ఉండండి. కాస్త కాఫీ పుచ్చుకొని వెళుదురుగాని" అన్నాను, ఇంటికి వచ్చిన మనిషికి ఆపాటి మర్యాద అయినా చేయకపోవడం సభ్యత కాదన్న ఉద్దేశంతో.

"ఎందుకు లెండి శ్రమ" అంది ఆమె.

"శ్రమకేముంది? వంటవాడు ఉన్నాడు. మీ పేరు చెప్పుకొని నేనుకూడా మరో కప్పు కాఫీ తాగుతాను" అని మల్లయ్యని పిలుస్తూ వంటఇంటివైపు వెళ్లేను. తీరా అక్కడికి వెళ్లేక మల్లయ్యని రేషన్లు తేవడంకోసం బజారుకి పంపేనన్న విషయం గుర్తువచ్చింది. కాని వెళ్లిపోతున్న ఆమెని కాఫీ తాగి వెళ్లమని నిలబెట్టి, ఇప్పుడు వంటవాడు లేడు, మీరు వెళ్లవచ్చు అంటే ఏం బాగుంటుంది?

'అయినా కాఫీ కాచడం ఏమంత కష్టం? గేస్ స్టౌ. నెస్‌కెఫే.... రెండు నిమిషాల్లో తయారయిపోతుంది' అనుకొని గిన్నెతో స్టౌమీద నీళ్లు పెట్టేను. రెండు కప్పుల్లోకి కాఫీగుండ వేసి, ఇంకో గిన్నెలోకి పాలు వంచేను. మరుగుతున్న నీళ్లని కప్పుల్లో పొయ్యబోతూంటే పట్టకారు పట్టు వదిలింది. వేడినీళ్లు కాళ్లమీద పాంటుమీద పడ్డాయి. కాలిన గిన్నె అంచు వేళ్లకి తగిలి చుర్రుమంది. "అబ్బా" అన్నాను బాధతో.

బాధతోకూడిన నా కేక, చేయి జారి గిన్నె కిందపడ్డ చప్పుడు హాలులోకి వినిపించిఉంటాయి. ఆవిడ ఆత్రంగా "ఏమయింది?" అంటూ వంట ఇంట్లోకి వచ్చింది.

"అబ్బే .... నీళ్లగిన్నె పట్టుతప్పి...." ఏడవలేక నవ్వుతూ అన్నాను.

"అదేమిటి మీరు కాఫీ పెడుతున్నారా?" తెల్లబోతూ అడిగింది ఆమె.

"వంటవాడు బజారుకెళ్లేడు....అందుకని...."

"ఇప్పుడు ఇంత శ్రమపడి మీరు పెట్టకపోతేనేం? మళ్లా మీ ఇంటికి రానా, కాఫీ తాగనా? సర్లెండి.... అటు నడవండి. ఆ కాలిన వేలికి ఏదో ఇంత మందు రాసి బట్టలు మార్చుకురండి. కాఫీ నే పెట్టి తెస్తాను" అంటూ చొరవగా ఆమె ముందుకు వచ్చింది.

అతి స్వల్పకాలంలోనే కొత్తవారి దగ్గిర కూడా చనువుగా మసలగలిగే నేర్పు కొందరికే ఉంటుంది. ఆ కోవకి చెందిందే ఈమె.

నేను బట్టలు మార్చుకు వచ్చేసరికి రెండు కప్పులతో కాఫీ తెచ్చి ఆమె హాలులో టీపాయ్‌మీద పెట్టింది.

"చివరకి ఇంటికొచ్చిన మీ చేత కాఫీ పెట్టించుకొని తాగుతున్నాను. మంచి మర్యాదేకదూ!" అన్నాను చిన్నగా నవ్వుతూ.

"దానికేం లెండి. ఇంకోసారి వచ్చినప్పుడు కాఫీ, టిఫిన్లు శాంతకీ, నాకూకూడా మీరే చేసి పెడుదురుగాని. హాయిగా కబుర్లు చెప్పుకొంటూ మేము ఆరగిస్తాము" అంది ఆమె వెళ్లిపోతూ.

ఆమె వెళ్లిన పదిరోజులనాడు శాంత పుట్టింటినుంచి తిరిగి వచ్చింది. ఆమె వచ్చి వెళ్లిన సంగతి మరపున పడకముందే శాంతతో చెప్పివేయడం మంచిదనుకొన్నాను. ఆఫీసు గొడవల్లో పడి నేను కాస్తా ఆ విషయం మరిచిపోతే, "నువ్వు ఊర్లో లేనప్పుడు నేను మీ ఇంటికి వచ్చి వెళ్లేను. పాపం, మీ వారు నా కోసం స్వయంగా కాఫీ కలిపి ఇచ్చేరు" అంటూ ఆవిడో ఉత్తరం ముక్క గిలికి పారేసిందంటే, ఇంక శాంత వేసే యక్షప్రశ్నలని ఎదుర్కోక తప్పదు.

ఎందు కిలా చేసే రంటుంది. ఏదో కారణం ఉండి ఉంటుంది. అందుకే దాస్తున్నారు అంటుంది. ఇంతలోనే అంత మరుసా అంటుంది.

ఇలా ఒకదాని కొకటిగా ప్రశ్నలతోరణం కట్టి మనిషిని వేధించడంలో శాంతకి ఎవరూ సాటిరారు.

అంత ప్రమాదం ఏర్పడకుండా శాంత వచ్చిన రాత్రే విమల వచ్చి వెళ్లిన సంగతి చెప్పి నా బరువు తీర్చుకొన్నాను.

"ఎవరు....మా విమలా?" పక్కమీదినుంచి ఒక్కసారి ఎగిరి గంతేసినంత పనిచేసింది శాంత, నా మాట విని.

"అవును" అన్నాను అదే మాటని మరొకసారి బలపరుస్తూ.

"ఎంత పనై పోయిందండీ. ఇంతకాలానికి అది వస్తే నేను లేకుండా అయింది. ఛీ ...ఛీ....పాడు బుద్ధి. పండుగ వెళ్లగానే వచ్చేయాలనే అనుకొన్నాను. వదిన కాదంటూ పట్టుపడితే ఉండి పోయేను. అలా వచ్చేసినా బాగుండేది'' అంది శాంత దిగులుగా.

"ఇందులో నువ్వు చేసేదేముంది? ఉత్తరం పత్తరం రాయకుండా ఊడిపడడం ఆవిడ తప్పే" అన్నాను నేను శాంతని సమాధానపరుస్తూ.

"తప్పా, ఒప్పా మాట కాదండి నేను అంటున్నది. పాపం, పుట్టెడు కష్టం నెత్తికెత్తుకొని- స్నేహితురాల్నికదా నాలుగు రోజుల పాటు నా ఇంట ఉండి ఊరట పొందుదామని అదివస్తే నేనేమో ఊరికి పోయి కూర్చున్నాను. వచ్చింది వచ్చినట్లే వెళ్లిపోక ఏంచేస్తుంది? మీరు తప్పుపనిచేసేరండి. ఏదోవిధంగా ఆరాత్రికి దాన్ని ఆపిఉంచి నాకో టెలిగ్రాంఇస్తే తీరిపోయేది. తెల్లవారేసరికి నేను వచ్చేసి ఉందును.

"ఎన్నాళ్లయిందండీ దాన్ని చూసి....అందునా ఈ రాత వచ్చేక.... అప్పుడు మీ జబ్బు మూలంగా వెంటనే పడలేదు. ఆ వెనక బాబిగాడు పుట్టడం, తీరా నేను వెళ్లాలనుకొనేసరికి అది మేనమామ గారింటికి వెళ్లిపోవడం—ఆయనకి దేశం కొసకి ట్రాన్స్ఫర్ అయి పోవడం అన్నీ ఒక్కలాగే సమకూడేయి.

"అవును కాని....ఏమండీ. విమల ఎలా ఉందండీ? మరీ దిగులుగా కళా కాంతీ లేకుండా ఉందా? ఎంత అందమైన ముఖమండీ దానిది! చెంపకి చేరడేసి కళ్లు, వెడల్పాటి నుదురు, ఆ నుదుటిమీద బొట్టే చాలండి దానికి వెయ్యి నగల పెట్టుగా ఉండేది. ఆ పాడు దేవుడికి ఏం పిచ్చి పట్టిందో మరి....అంత అందం ఇచ్చి దాని బ్రతుకు ఇలా మొగ్గలోనే తుంచేసేడు. నిగనిగలాడుతుండే ఆ ఉంగరాల జుట్టు జడ వేసుకొన్నా, ముడి చుట్టుకొన్నా ఎంత అందంగా

ఉండేది! జడ జర్రిపోతులా మోకాళ్లని తాకేది కదండీ. మా స్నేహితురా ళ్లందరి కళ్లూ దాని జుట్టుమీదనే ఉండేవి. 'ఏమే, విమలా, ఏం దానంచేసి పుట్టేవే ఇంత జుట్టు పొందడానికి?' అనే వారం. వాలు జడ వేసుకొని పువ్వులచెండు పెట్టుకుంటే....ఏమండీ....కొంప తీసి విమల జుట్టు....

"శాంతా" అన్నాను కంగారుగా, ఆమెని ఇంక ముందుకి పోనీయడం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదన్న అభిప్రాయంతో. నేను మరో సారి పప్పులో కాలు వేసేనని ఖచ్చితంగా తేలి పోయింది. ఆ రోజు ఆమె చెప్పిన పేరు ఎక్కడో దగ్గిర రాసి పెట్టుకోవాలను కొంటూనే అశ్రద్ధ చేసేను. ఇంత హంగామా జరిగేక ఆపాటి పేరు జ్ఞాపకం ఉండదా అనుకొన్నాను. లేదు అన్న సంగతి శాంత మాటలు వింటుంటే తెలిసి వచ్చింది. ఆమె చెప్పిన పేరు, శాంత అదివరలో నాతో అన్న పేరు ఒకటా, కాదా అన్న అనుమానం అప్పుడే కలిగింది. కాదని కూడా అనుకొన్నట్లు జ్ఞాపకం. నిశ్చయంగా ఆమె చెప్పిన పేరు ఇంకేదో అయి ఉంటుంది. కమల, నిర్మల, శ్యామల....ఏం పేరబ్బా ఆమెది?

ఎంత సేపు ఆలోచించినా ఇదీ అని స్పష్టంగా చెప్పే అవకాశం కలగ లేదు. ఏ పేరు కాపేరే సరిగా అనిపించసాగింది. ఏం చెయ్యాలో తెలియక- దొంగతనంగా సంగ్రహించిన జీడి పిక్క కొట్టుకొంటూ చెయ్యి చితగకొట్టుకొన్న అబ్బాయిలా గింజుకు పోయేను.

శాంత చెవుల్లో నా పిలుపు పడలేదు, తన ధోరణిలో తను అలా చెప్పుకుపోతూనే ఉంది.

"అయ్యో రామ! మీకు తెలియదండీ....విమల అత్తగారు ఎంత ఛాందసురా లనుకొన్నారు. ఆ మధ్య....ఎవ రా అమ్మాయి....ఆవిడకి ఆడబిడ్డ కూతురో, కోడలో అవుతుంది. మొగుడు పోయేసరికి పచ్చి బాలెంతరాలు. చిన్నబిడ్డల తల్లి అన్న మాటైనా లేకుండా జుట్టు తీయించి మూల కూర్చోపెట్టేరు. తల్లిని ఆ రూపులో చూసి ఎడపిల్లలు ఒకటే గోల. 'ఛీ....ఛూ....ఈ రోజుల్లో ఎవరూ అలా

చెయ్యరు' అంటూ నా మాటని కొట్టేపారేస్తారు మీరు, ఉన్నారు, బాబూ, ఉన్నారు. అందరూ కాకపోయినా ఇంకా కొందరు విమల అత్త కోవకి చెందినవాళ్లు ఉన్నారు.

"పైగా అది ధర్మంట, ఆచారంట. ఈ ధర్మాలకి, ఆచారాలకి ఒక రీతి, నీతి ఉండక్కర్లేదా అంట? పెళ్లాం చస్తే మగాడు నెల తిరక్కుండా పెళ్లిపీటలమీద కూర్చోవచ్చుట. ఆడది మాత్రం వాడి చేత తాళి కట్టించుకొన్న పాపానికి జీవితాంతం ఒక సంతోషం, సుఖం అన్న మాట లేకుండా, పై వారి కంటపడకుండా మూలపడి ఉండాలిట. ఎవర్తయినా గట్టిపిండం మొండికెత్తి బయట పడుతుం దేమో అని అలా జరిగినా దాని ముఖం ఎవరూ చూడకుండా ఇలాటి ఆచారాలు పెట్టి అందవికారంగా ఉండేలా చెయ్యడం, ఏకాదశి, పున్నం అంటూ ఉపవాసాలు మాడ్చి జీవచ్ఛవంలా తయారు చెయ్య డం మగవాడికి లేని ఈ విధులన్నీ ఆడదానికే ఎందుకు పెట్టాలి? ఒకరికి అట్టు, ఇంకొకరికి ముక్కా-నా?

"మాటవరసకి మా విమల్నే చూడండీ. జీవితంలో అది ఏం అనుభవించింది? మిగిలిన జీవితమంతా అటు అత్తవారింట్లోనో, ఇటు పుట్టింట్లోనో చాకిరీ చేస్తూ, ఓ అచ్చటా ముచ్చటా అన్న మాట లేకుండా బ్రతకవలిసిందేనా? అలా బ్రతకలేక అది ఏ అఘాయిత్య మేనా చేస్తే ఆ పాపం ఎవరిదంటారు? అనాదినుండి ఆడదాన్ని కీలు బొమ్మను చేసి, పక్షపాతంతో కూడిన ఈ ధర్మాలు, న్యాయాలు ఏర్పరిచి, ఆమెను అణుమాత్రమైనా తల ఎత్తనీకుండా అణచి పెడుతున్న మీ మగాళ్లది కాదూ?"

శాంత ఆవేశంగా నా వంక చూస్తూ 'జవాబు చెప్పు' అన్నట్లు ప్రశ్నించింది.

"నాదిమాత్రం కాదు. అప్పటికి నే నింకా పుట్టనే లేదు" అన్నాను ఎంతో అమాయికంగా ముఖం పెట్టి చిన్నగా నవ్వుతూ.

"మీ రెప్పుడూ ఇంతే! నే నెంతో సీరియస్‌గా ఒక విషయం గురించి అడుగుతూంటే ఏదో ఓ మాట చెప్పి నవ్వుతాలుగా తేల్చి పారేస్తారు." శాంత ఉడుకుమోత్తనంతో మూతి ముడిచింది.

ఇంక ఊరుకొని లాభం లేదు. నా మతిమరుపుకి శాంతచేత ఎన్ని మందలింపులు అందుకోవలసి వచ్చినా అసలు విషయాన్ని చెప్పి చేతులు కడుక్కోడమే మంచిది అన్న నిశ్చయానికి వచ్చేను.

"చూడు, శాంతా! ఇందులో ఏదో చిన్న పొరపాటు జరిగి పోయింది. ఇలా ఆలోచిస్తూంటే ఆవిడ పేరు విమల అయి ఉండ దనిపిస్తున్నాది. ఆడవారికుండే సవాలక్ష పేర్లలో ఇంకేదో అయి ఉంటుంది" అన్నాను.

"ఆఁ" అంటూ ఆశ్చర్యపోయింది శాంత. కొంత సేపటికి అందులోంచి కోలుకొని "ఏం మనిషండీ మీరు! ఇంటి కొచ్చిన మనిషి పేరు ఇంతలోనే మరిచిపోయేరా? మీకు ఎక్కడలేని మతి మరుపు నా స్నేహితురాళ్ల పేర్ల దగ్గిరికి వచ్చేసరికే వస్తుంది లాగుంది. ఆ రోజు శారద పెళ్లిలోనూ అలాగే చేసేరు...."

"అది సర్లే శాంతా, ఏదో అనుకోడమేకాని ఆవిడని నేను అట్టే సార్లు కలుసుకోలేదు కదా....అంచేత...."

"అయితే....మనింటి కొచ్చిన మనిషి విమల కాకపోతే మరెవ రంటారు?"

"ఏమో, శాంతా! సరిగా జ్ఞాపకం లేనప్పుడు ఒక పేరుకి ఇం కొకటి చెప్పి నిన్ను కంగారుపెట్టేదానికన్నా ఊరుకోడమే మంచి పనిగా తోస్తున్నాది. ఆ వచ్చిన ఆవిడ ఎవరైనా, మళ్లా వస్తా నన్నాది కదా. నీకు ఉత్తరం కూడా రాస్తా నంది. అప్పుడు విశే షంలా నీకే తెలుస్తుంది. దయతలచి నన్నింతటితో వదిలిపెట్టు" అన్నాను బద్ధకంగా ఆవలిస్తూ.

రాత్రి ఆలస్యంగా నిద్రపోవడంవల్ల ఉదయం బాగా పొద్దు ఎక్కే వరకు తెలివి రాలేదు. ఆఫీసుకి ఆలస్యం అయిపోయిందన్న తొందర్లో శ్రీమతి ఇచ్చిన కాఫీ, టిఫిన్లు కంఠంలో పోస్తూ ఉంటే "టెలిగ్రాం, సార్" అంటూ వీధిలోంచి కేకవినిపించింది. బాబిగాడు పరుగున వెళ్లి టెలిగ్రాం అందుకొని నా ముందు టేబిలుమీద పెట్టేడు.

"ఎక్కడినుంచి టెలిగ్రాం?" శాంత ఆత్రంగా ప్రశ్నించింది.

"ఈ మెయిలులో మీ విమల వస్తున్నాదిట. స్టేషనుకి రమ్మని...." అంటూ టెలిగ్రాం శాంత చేతిలో పెట్టేను. పెడుతూ పెడుతూ మళ్లీ ఒకసారి తిప్పి చూసేను, అది మద్రాసునుంచి ఇచ్చిందే. ఆ రోజు వచ్చినావిడా మద్రాసు పెడుతున్నానని చెప్పినట్టే గుర్తు. ఆమె, ఈమె ఒకరేనా? లేక వేరు వ్యక్తులా? మళ్లీ ఆలోచన మొదలయింది.

ఒకరైనా కాకపోయినా అప్పుడు ఆలోచిస్తూ కూర్చోడానికి సమయం లేదు. అప్పటికే ఆలస్యం అయింది. సర్వీసుకి పోయిన కారు ఇంకా తిరిగి రాలేదు. టాక్సీకోసం వెయిటింగ్ ఉండనే ఉంది. తొందరపడుతూ బయలుదేరేను.

"చూసేరాండి. కొన్ని సంగతులు ఎంత తమాషాగా జరుగుతాయో? నిన్న రాత్రల్లా విమల్ని చూడ్డం అవలేదని నేను ఆరాటపడితే, తెల్లవారకుండానే తను వస్తున్నానని టెలిగ్రాం" అంది శాంత పుట్టెడు సంతోషం ఉట్టిపడుతున్న స్వరంతో.

"మరేం అభిమానం ఉన్న చోట అలాగే అవుతూంటాయిట. మరి నేను వెళుతున్నాను, మెయిలు పన్నెండు కాకుండానే వస్తుంది. కారు కూడా లేదు. కాస్త ముందుగా వెళితే టాక్సీలు దొరక్కపోడం అన్న బాధ ఉండదు."

"అలాగే వేళ చూసుకొని నే వెళతానుకాని, మీ రొక పని చేస్తారా?" అంది శాంత ముందుకి వస్తూ.

"ఏమిటి?" అన్నాను వెళ్లిపోతున్నవాడిని ఆగి, వెనక్కి తిరిగి చూస్తూ.

"మెయిలు రావడం అటైనా, ఇటైనా ఇంటికొచ్చేసరికి ఆలస్యం కావచ్చు. ఇంటికొచ్చి ఒక్కరూ కూర్చుని ఏం తింటారు? ఈ పూటకి ఏదైనా హోటల్లో అక్కడే భోజనం చేసేయండి" అంది శాంత.

"అలాగే" అన్నాను గుమ్మం దిగుతూ.

"సాయంకాలం పెందరాళే వచ్చేస్తారా?" శాంత మరో కేక పెట్టింది.

"ఓకే" అన్నాను, దారిన పోతున్న టాక్సీకోసం చెయ్యి ఊపుతూ.

సంవత్సరం ఆఖరి రోజులు. ఆఫీసులో పని జాస్తిగా ఉంది. ఎంత త్వరగా బయటపడా లనుకొన్నా ఆలస్యం అవనే అయింది. దారిలో దిగి బజార్లో ఇన్ని పళ్లు, బాబిగాడికి టాఫీలు కొని ఇంటి ముఖం పట్టేను.

గుమ్మంలో నే ఎదురు పడ్డాడు బాబిగాడు. కొన్న టాఫీలు వాడి చేతిలో పెట్టి, "అమ్మేదిరా, బాబీ!" అన్నాను.

"ఇంట్లో ఉంది" అన్నాడు వాడు గదివంక చూస్తూ.

ఇంటికి చుట్టం వచ్చిన జాడలేం కనిపించలేదు. కొత్తగా వచ్చిన మేగజైన్స్ చూస్తున్నాది శాంత.

"శాంతా" అన్నాను, గదిలో కాలు పెడుతూ.

"వచ్చేరా....రండి....మీ మాటే అనుకొంటున్నాను, ఇంకా ఆ ముద్దుల ప్రేయసిని వదిలి రావడానికి ఈయనగారికి బుద్ధి పుట్టలేదా అని."

తను తాళి కట్టించుకొన్న పెళ్లాం అయితే, ఆఫీసు నాకు వలచి వలపించుకొన్న ప్రియురాలు అంటుంది శాంత. అందుకే ఓ అంతట కాని ఆఫీసు వదిలి రా బుద్ధికాదుట నాకు.

"అది సరే కాని....ఆవిడ ఎక్కడికైనా వెళ్లారా?" అన్నాను, ఇటు అటు చూస్తూ.

"ఎవరు?" అంది శాంత పుస్తకం మీంచి దృష్టి తిప్పకుండానే.

"అదే....మీ స్నేహితురాలు విమల. ఉదయం మెయిలులో రాలేట?"

"ఆఁ....రావడమైతే వచ్చింది కాని, దానికి ఇక్కడ దిగే తీరిక లేదుట. మళ్లా ఎప్పుడో వస్తుందిట" అంది శాంత అంటీ ముట్ట నట్లు.

ముందు రోజు రాత్రి విమలని గురించి అంత ఆప్యాయంగా, అంత ఆవేశంగా మాట్లాడిన శాంత అలా ముభావంగా 'ట' లతో వాక్యం పూర్తి చేస్తుంటే నాకు నిజంగా ఆశ్చర్యం వేసింది.

"అదేం....అలా....మనింట ఒక్క రోజైనా ఉండి వెళ్ల మన లేకపోయేనా?" అన్నాను.

"అప్పుడు మీతో చెప్పిందట కదా. ఏదో ఉద్యోగం ఇంటర్వ్యూకి వెళుతున్నానని. వాళ్లు వెంటనే వచ్చి జాయిన్ కమ్మన్నారుట. ఇంటికి పోయి సామాన్లు, అవీ తెచ్చుకోవాలని బయలుదేరిందిట." చేతిలోని మేగజైన్ విసురుగా టేబిలు మీదికి విసురుతూ కుర్చీలోంచి లేచింది శాంత.

"అంటే?"

"అంటే లేదు, గింటే లేదు. ఇంకా మీకు ఆకలి కాలేదా ఏమిటి? లేవండి. ఇప్పటికే చాలా వేళయింది. మల్లయ్య సినీమాకి వేళయిపోతున్నాదని తొందరపడుతున్నాడు." వెను తిరిగి చూడకుండా వంట ఇంటివైపు దారి తీసింది శాంత.

"వడ్డన అయింది. రండి" అనే శాంత హెచ్చరిక వినేవరకు అలా నోరు తెరచుకొని శాంత వెళ్లినవైపే చూస్తూ ఉండిపోయేను.

ఆ రాత్రి భోజనాలదగ్గిర, మరునాడు ఉదయం కూడా శాంత అయిన దానికి కానిదానికి చిర్రు, బుర్రు లాడుతూనే ఉంది. అవును. పాపం, బుట్టెడు సానుభూతి, కడివెడు కన్నీళ్లు వెంట తీసుకొని స్నేహితురాల్ని ఓదార్చాలని వెళ్లిన మనిషికి వాటి అవసరమే రాక పోతే కోపం రాదూ? అలా రాకపోతే ఆమె ఆడదే కాదు. మరి మా శాంత కూడా ఆడదే,